క్లుప్తంగా

ఈపూరు ఎంపీడీవోగా ప్రభాకర్

ఈపూరు: ఎంపీడీవోగా ప్రభాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన రంగ నాయకులు బదిలీపై ప్రకాశం జిల్లాకు వెళ్లారు. బదిలీలో భాగంగా మేడికొండూరులో బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రభాకర్ ఈపూరుకు వచ్చారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందేలా చూస్తామన్నారు. ప్రజల ఏ సమస్యలు ఉన్నా నేరుగా తనను కలవచ్చని తెలిపారు.

నాదెండ్ల ఏపీఎంగా రమేష్‌బాబు

నాదెండ్ల: మండల వెలుగు ప్రాజెక్టు ఏపీఎంగా మేకతోటి రమేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో రొంపిచర్ల మండలం నుంచి నాదెండ్లకు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకూ సీసీగా ఉన్న సాంబశివరావు ఇన్‌చార్జి ఏపీఎంగా వ్యవహరించారు. ఏపీఎంగా బాధ్యతలు స్వీకరించిన రమేష్ బాబును వెలుగు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఆయన స్వస్థలం చిలకలూరిపేట పట్టణం.

యడ్లపాడు ఈవోపీఆర్డీగా జాకీర్‌హుస్సేన్

నాదెండ్ల: యడ్లపాడు ఈవోపీఆర్డీగా షేక్ జాకీర్ హుస్సేన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన నాదెండ్ల మండలం ఈవోపీఆర్డీగా పనిచేస్తూ ఇన్‌చార్జి ఎంపీడీవోగా వ్యవహరించారు. నాదెండ్ల కార్యాలయంలో శుక్రవారం రిలీవ్ అయి యడ్లపాడులో బాధ్యతలు చేపట్టా రు. యడ్లపాడు ఎంపీడీవోగా హేమలతదేవి ఇటీవల బదిలీపై వచ్చిన విషయం విదితమే. నాదెండ్ల సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న స్వరూపారాణి ఇన్‌చార్జి ఎంపీడీవోగా వ్యవహరించనున్నారు.

రొంపిచర్ల ఆర్‌ఐగా కోటేశ్వరరావు

రొంపిచర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నూతన ఆర్‌ఐ గా పి. కోటేశ్వరరావు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన ఈపూరు మండలం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చి ఆర్‌ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్‌ఐగా పనిచేస్తున్న సుబ్బారావు డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతి పొంది తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. నూతన ఆర్‌ఐగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన కోటేశ్వరరావును వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

పలువురు వీఆర్వోల బదిలీ

నాదెండ్ల: మండల ఆర్‌ఐగా పనిచేస్తున్న షేక్ రమీజా చిలకలూరిపేటకు బదిలీ అయ్యారు. సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాజ్యలక్ష్మి యడ్లపాడుకు బదిలీ అయ్యారు. ఇర్లపాడు వీఆర్వోగా పనిచేస్తున్న ఎం.నాగరాజు నరసరావుపేట మండలం గురవాయపాలెంకు బదిలీ అయ్యారు. సాతులూరు1 వీఆర్వో మురళీకృష్ణ చిలకలూరిపేట మండలం పోతవరంకు, గణపవరం1 వీఆర్వో జీవీ రమణ చిలకలూరిపేట మండలం గంగన్నపాలెంకు, గొరిజవోలు వీఆర్వో కె అశోక్ యడ్లపాడు మండలం ఉన్నవకు, నాదెండ్ల1 వీఆర్వోగా పనిచేస్తున్న బి కృష్ణచైతన్య యడ్లపాడు మండలం కొండవీడుకు, కనపర్రు వీఆర్వోగా పనిచేస్తున్న మురళీ కృష్ణ పిడుగురాళ్ళమండలం బ్రాహ్మణపల్లికి, చందవరం వీఆర్వో పి.అనూష యడ్లపాడు మండలం మైదవోలుకు, ఎండుగుంపాలెం వీఆర్వో ఆనంద్‌కుమార్ యడ్లపాడు మండలం తుర్లపాడుకు బదిలీ అయ్యారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

నాదెండ్ల: మండలంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం బదిలీ అయ్యారు. నాదెండ్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు గణపవరం పంచాయతీకి, ఈయన స్థానంలో యడ్లపాడు మండలం తుర్లపాడు కార్యదర్శి సుబ్బారావు రానున్నారు. తూబాడు కార్యదర్శి జంగు జరీనా చిలకలూరిపేట మండలం రాజాపేటకు బదిలీ అయ్యారు. ఈమె స్థానంలో నకరికల్లు మండలం కండ్లగుంట నుండి సత్యనారాయణ బదిలీపై రానున్నారు. చిరుమామిళ్ళ కార్యదర్శి అల్లడి స్వాతి చిలకలూరిపేట మండలం మద్దిరాలకు బదిలీ అయ్యారు. కనపర్రు కార్యదర్శి జీవీఎల్ కాంతారావు యడ్లపాడు మండలం తుర్లపాడుకు బదిలీ అయ్యారు. ఇర్లపాడు పంచాయతీ కార్యదర్శి మాధవి యడ్లపాడు మండలం తిమ్మాపురంకు బదిలీ అయ్యారు. సంకురాత్రిపాడు కార్యదర్శి లక్ష్మీనారాయణ అప్పాపురం బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో రాజుపాలెం మండల కార్యదర్శి ఠాగూర్‌రెడ్డి రానున్నారు. గొరిజవోలు కార్యదర్శి షేక్ ఖలీల్ అహమ్మద్ ఎండుగుంపాలెంకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో చిలకలూరిపేట మండలం గోపాళంవారిపాలెం కార్యదర్శి ప్రశాంతి బదిలీపై రానున్నారు. బుక్కాపురం కార్యదర్శి వెంకటరావు యడ్లపాడు మండలం కొత్తపాలెంకు బదిలీ అయ్యారు.

తాపీ కార్మికుడి మృతి

చిలకలూరిపేటటౌన్: తాపీ పనులు నిర్వహిస్తున్న క్రమంలో కార్మికుడికి విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన సంఘటన పట్టణంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని చీరాల రోడ్డులోని కక్కెరదాసయ్య గోదాముల వద్ద నివాసం ఉండే పాలెపోగు ఇమ్మానీయేలు (48) రోజువారీ పనుల్లో భాగంగా కళామందిర్ సెంటర్లోని మేదర బజారులో ఉన్న ఓ ఇంటి ఆధునీకరణ పనులు చేస్తున్నాడు. రెండో అంతస్తులో బేల్‌దారు పనులు నిర్వహిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. స్థానికులు గమనించి గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఇమ్మానీయేలు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

భయపెడుతున్న భౌ...భౌలు



- జిల్లా కేంద్రంలో పెరిగిన వీధి కుక్కలు
- ప్రతిరోజూ కుక్కకాటుకు గురవుతున్న మహిళలు, పిల్లలు
- పిల్లలను ఒంటరిగా బయటకు పంపాలంటే భయపడుతున్న తల్లిదండ్రులు
- సంతగుడిపాడులో ఒక్కరోజే పది మందిని కరిచిన కుక్క
- రోజుకు 15 మంది వరకూ యాంటీ రేబిస్ ఇంజక్షన్లు



ప్రకాష్‌నగర్‌లోని రిజిస్ట్రార్ కార్యాలయ సెంటర్‌లో వీధి కుక్కలు

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేటతో పాటు పలు గ్రామాల్లో వీధి కుక్కల సందడి అధికంగా కన్పిస్తోంది. ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట కుక్కకాటుకు గురైన జనాలు తీవ్ర గాయాలపాలవుతున్నారు. పట్టణంలోని పలు ప్రదేశాల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ పిల్లలు, మహిళలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. మామూలుగా రోడ్లపై నడిచి వేళ్లే మహిళలు, పిల్లల చేతిలోని వాటిని లాక్కొని పోవటం, ఎగబడి కరిచి గాయాలపాలు చేయటం నిత్యకృత్యంగా మారింది. దీని వలన పిల్లలను ఒంటరిగా బజార్లకు, స్కూళ్లకు పంపేందుకు కూడా తల్లితండ్రులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు వీధుల్లోకి ఇళ్లల్లోని వేస్ట్ పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో చుట్టి విసిరేస్తున్నారు. వాటిని ఈ కుక్కలు ఆహారం కోసం రోడ్లపైకి లాక్కొచ్చి చించి ఆ వ్యర్థాలను చిందరవందరగా రోడ్లపైన వదిలిపెట్టిపోతుండటంతో రాకపోకలు సాగించే జనాలకు ఇబ్బందికరంగా ఉంటుంది.



సంతగుడిపాడులో కుక్క కరచి కాలికి గాయమైన దృశ్యం

రోడ్లపై ఎక్కడబడితే అక్కడ పడుకున్న వాటిని చూడక తోకను, కాళ్లను త్రొక్కినా ఎగబడి జనాలను కరవటం చేస్తున్నాయి. దీంతో యాంటి ర్యాబిస్ ఇంజన్లు చేయించుకునేందుకు హాస్పిటళ్లకు పరిగెత్తి రూ.2 వేలకు పైగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ప్రజలకు దాపురిస్తుంది. ముఖ్యంగా స్లమ్ ఏరియాలైన పలు కాలనీల్లో కుక్కల హడావుడి ఎక్కువగా కన్పిస్తుంది. రాత్రి సమయాల్లో మహిళలు, పిల్లలు ఒంటరిగా తిరగటం దుర్లభంగా మారింది. ఇదిలా ఉండగా రొంపిచర్ల, సంతగుడిపాడు గ్రామాల్లో ఒకేరోజు పదిమందిని ఓ కుక్క కరిచింది. వీరిలో గాయపడినో వృద్ధురాలు ఐదురోజులపాటు నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో ఉండాల్సి వచ్చింది. అయితే వీటిని నియంత్రించేందుకు ఇటీవల కాలంలో పురపాలక అధికారులు తీసుకున్న చర్యలు ఏమీలేవు. వీటికి పునరోత్పత్తిని అడ్డుకునేందుకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలనే ప్రతిపాదనలు వచ్చినా ఎక్కడా జరిగిన దాఖలాలు లేవు.

ఐదారేళ్ల క్రితం పట్టణంలోని గుంటూరు రోడ్డులో గల కబేళా స్థలంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసిన వీధి కుక్కలు కొద్దిరోజులపాటు వసతి కల్పించేందుకు సుమారుగా రూ.5 లక్షల పురపాలక నిధులతో ఇనుపగ్రిల్స్‌తో చాంబర్లను ఏర్పాటు చేశారు. వాటిని ఎప్పుడూ ఉపయోగించలేదు, వాటి జాడ లేకుండా పోయింది. ఆ తర్వాత కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.



కుక్క కరిచి వి.రెడ్డిపాలెం ప్రాథమిక వైద్యకేంద్రంకు చికిత్స కోసం వచ్చిన వృద్ధురాలు (ఫైల్)

రోజుకు 10 నుంచి 15 మందికి ఇంజక్షన్లు

ప్రభుత్వ వైద్యశాలలో ప్రతిరోజూ 10 నుంచి 15 మంది వరకు యాంటీరేబీస్ ఇంజక్షన్లు చేస్తున్నాం. కుక్కలు, కోతులు కరిచాయంటూ చాలామంది హాస్పిటల్‌కు వస్తున్నారు. వారందరికి ఇంజన్లు చేస్తున్నాం. ప్రతిఒక్కరూ ముందుజాగ్రత్త చర్యగా ఇంజక్షన్లు చేయించుకోవాల్సిందే. లేకపోతే ప్రాణాలకే ప్రమాదం.

–ఎం.మంత్రు నాయక్, సూపరింటెండెంట్, ప్రభుత్వ వైద్యశాల

కుక్కల నియంత్రణకు చర్యలు

పట్టణంలో పెరిగిపోతున్న వీధి కుక్కల నియంత్రణకు చర్యలు ప్రారంభించాం. స్థానిక వెటర్నరీ డాక్టర్‌ను సంప్రదించాం. ఆయనతో శనివారం సమావేశమౌతున్నాం. కుక్కలను పట్టుకొని కుటుంబ నియంత్రణ చేయాలనే ఆలోచనలో ఉన్నాం. ఇక్కడ చేయకపోయినా చేసే ప్రాంతానికైనా పంపించే ఏర్పాట్లలో ఉన్నాం.

–రామకోటయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్

తహసీల్దార్‌పై జేసీ ఆగ్రహం

- సీఎం ఫొటో పక్కన పడవేయటంపై విచారణ
- ఉప ముఖ్యమంత్రి చిత్రపటం కొనుగోలు చేసి కార్యాలయానికి అందజేసిన జనసేన

సాక్షి స్పందన

నరసరావుపేటటౌన్: తహసీల్దార్ కార్యాలయంలో సీఎం చంద్రబాబునాయుడు ఫొటో పక్కన పడవేయటంపై జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించినట్లు సమాచారం. తహసీల్దార్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు ఫొటో వేస్ట్ కాగితాలు పడవేసే టబ్‌లో ఉంచటంతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటో ఏర్పాటు చేయని వ్యవహారంపై పాపం.. జన సైనికులు అనే శీర్షికను శుక్రవారం సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్, తహసీల్దార్ వేణుగోపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలియవచ్చింది. దీంతో అప్పటి వరకు సరైన ప్రాధాన్యత లేకుండా పక్కన పడవేసి ఉన్న సీఎం చంద్రబాబు ఫొటోను గోడకు ఏర్పాటు చేశారు. అదే విధంగా డిప్యూటీ సీఎం ఫొటో లేకపోవటంపై నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ సయ్యద్ జిలాని ఆధ్వర్యంలో ఏవో శ్రీనివాసరావును ఫొటో ఏర్పాటులో నిర్లక్ష్యంపై ప్రశ్నించారు. దీనిపై సరైన సమాధానం లేకపోవడంతో అధికారుల తీరును నిరసిస్తూ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం స్వయంగా జనసైనికులే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాన్ని కొనుగోలు చేసి తీసుకువచ్చి కార్యాలయ ఏవోకు అందజేశారు.



తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేస్తున్న చిత్రపటాలు

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోండి

బొల్లాపల్లి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని బండ్లమోటు ఎస్‌ఐ ఎ.బాలకృష్ణ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. డీజేలు, ఆర్కెస్ట్రా, డాన్స్ ప్రోగ్రాములు అనుమతి లేకుండా పెట్టకూడదని తెలిపారు. పోలీసుల అనుమతి తీసుకొని డీజేలు, ఆర్కెస్ట్రాలు, డ్యాన్స్ ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేసుకొని చుట్టుపక్కల ప్రజలకు ఇబ్బందిలేకుండా చూసుకోవాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఫైనాన్స్ సిబ్బంది తీరుపై నిరసన



వినుకొండ(నూజెండ్ల): చోళ మండల్ ఫైనాన్స్ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలంటూ న్యూహెచ్‌ఎంసీ అసోసియేషన్ తరపున వినుకొండ పట్టణంలోని చోళ మండలం ఫైనాన్స్ ఆఫీస్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు పల్నాడు జిల్లా మినీట్రక్స్ అండ్ ఓనర్స్ డ్రైవర్స్ ర్యాలీ నిర్వహించారు. చోళ మండల్ ఫైనాన్స్ వారి దౌర్జన్యం వల్ల వినుకొండ పట్టణానికి చెందిన దావులూరి కళ్యాణ్ చౌదరి ఆత్మహత్య ప్రయత్నం చేసి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడన్నారు. దీనికి కారణమైన ఫైనాన్స్ మేనేజర్‌పై, ఎగ్జిక్యూటివ్‌పై చర్యలు తీసుకోవాలని పట్టణసీఐకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్తిక్, కరిముల్లా, కుమార్, బాజీ, మసూద్, మస్తాన్, ముల్లా బాషా తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు బోనస్‌రేటు పెంచాలి

నరసరావుపేట: జీవిత బీమా చేసిన ఖాతాదారులకు బోనస్‌రేటు పెంచాలని, తీసుకునే రుణాలపై వడ్డీరేటు తగ్గించాలని ఆ సంస్థ ఏజెంట్లు కోరారు. శుక్రవారం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో ఎల్‌ఐసీ యాజమాన్యం, ఐఆర్‌డీఏఐ విధానాలకు యూనియన్ అధ్యక్షులు షేక్ నబీబాజీ ఆధ్వర్యంలో ఏజెంట్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నూతనంగా ఏకపక్షంగా ఏజెంట్ కమిషన్ ఆపటం దారుణమని అన్నారు. పాత విధానం కొనసాగించాలని, వెంటనే యూనియన్‌తో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. ఎల్‌ఐసీ ఏవోఐ– లియాఫి యూనియన్ నాయకులు పీవీవీ ప్రసాద్, కె.మల్లికార్జునరావు, ఏజెంట్స్ సభ్యులు, ఖాతాదారులు పాల్గొన్నారు.



బ్రాంచ్ కార్యాలయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తంచేస్తున్న ఏజెంట్లు, ఖాతాదారులు

ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజిల్లా పరిధిలోని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు అవసరమైన ఉపకరణములు అందించేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ సహాయ సంచాలకులు సువార్త శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు తమ తెల్ల రేషన్‌కార్డు, ఆధార్, కుల ధృవీకరణ, బోనోఫై, స్టడీ సర్టిఫికెట్ (లాప్‌టాప్ నిమిత్తం), ఫొటో, మొబైల్ నెంబర్ తదితర వివరాలతో www.apdarcac.ap.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. ఆన్‌లైన్ దరఖాస్తును తమ కార్యాలయంలో అందచేసినట్లయితే వారి అర్హత, ఉపకరణముల లభ్యత మేరకు అందచేస్తామని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని, మాన్యువల్ దరఖాస్తులు స్వీకరించబడవని స్పష్టం చేశారు.

తొలగించిన కార్మికులను మళ్లీ చేర్చుకోవాలి

మున్సిపల్ కార్యాలయం ఎదుట రెండోరోజుకు చేరిన కార్మికుల దీక్ష

నరసరావుపేట: మున్సిపాలిటీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులను అధికారులు ఎటువంటి కారణాలు లేకుండా విధులకు హాజరు కావద్దని చెప్పడం అన్యాయమని జిల్లా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) జిల్లా గౌరవ అధ్యక్షులు సిలార్ మసూద్ అన్నారు. రాజకీయ కారణాలతో తొలగించిన కార్మికులను మళ్లీ పనిలోకి తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయంకు ఎదురుగా చేపట్టిన ధర్నా శుక్రవారంతో రెండో రోజుకు చేరింది. ధర్నా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ అధికారులు చెప్పిన విధులను ఎటువంటి లోపాలు లేకుండా విధులను నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని వేధిస్తూ గత రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం దుర్మార్గమని అన్నారు. మున్సిపల్ కమిషనర్ కలగజేసుకొని కార్మికులను విధుల్లో కొనసాగించి వారికి వేతనాలు చెల్లించాలని, ఇటువంటి పరిస్థితులు పునరావృతంగా కాకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షులు షేక్ చిన్న అల్లాబక్షు, షేక్ మహబూబ్ సుభాని, శివరాత్రి రమాదేవి, పోలూరి రమణ, షేక్ సైదా, షేక్ మహబూబ్ సుభాని, బత్తుల నాగమల్లేశ్వరి, అక్కి పద్మ, షేక్ సైలు, ఎం.దీపిక పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శిలార్‌మసూద్

విద్యాలయాలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ సాయికుమార్

నరసరావుపేట: దసరా సెలవుల్లో కూడా జిల్లాలోని అన్ని ప్రైవేటు జూనియర్ కళాశాలలు, పాఠశాలలు యధావిధిగా జరుగుతున్నా బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్, పాఠశాల విద్యాశాఖ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయంగా ఉందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ కోట సాయికుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దసరా సెలవులు మూడో తేదీ నుంచి 13వ తేదీ వరకు సెలవులు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇందుకు భిన్నంగా జిల్లాలో విద్యాలయాలు నడుస్తున్నాయన్నారు. విద్యార్థులు హాజరు కాకపోతే హాజరు వేయమని బెదిరించి మరీ నిర్వహిస్తున్నారు. అదేమంటే ఐదోతేదీవరకు తమకు అధికారులు గడువు ఇచ్చారని చెబుతున్నారని అన్నారు. దీనిపై ఏ అధికారి స్పందించటంలేదు అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు అమలు చేయలేని స్థితిలో అధికారులు ఉండడం శోచనీయమన్నారు. అధికారులపై విద్యార్థి సంఘాలు, తల్లితండ్రులు ఫిర్యాదులు పంపించారన్నారు. యాజమాన్యాలపై చైల్డ్ ప్రొటెక్షన్ యాక్ట్, ప్రభుత్వ ఉత్తర్వుల ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం జోక్యం చేసుకొని ఉత్తర్వులు అమలు చేయాలని పల్నాడు జిల్లా కమిటీ తరపున డిమాండ్ చేశారు.

ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన ప్రత్యేక అధికారి

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ శుక్రవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. ఇన్‌పేషంట్స్, అవుట్ పేషంట్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలపై రోగులతో మాట్లాడారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా, లేదా అని రోగులను ప్రశ్నించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారని, వైద్య సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ మమతప్రియ పాల్గొన్నారు. అనంతరం చిన్నతురకపాలెం గ్రామ సచివాలయంను సందర్శించి రికార్డులను ప్రత్యేక అధికారి పరిశీలించారు. సిటిజన్‌ఛార్ట్ అమలు తీరుపై సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామంలో పర్యటించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న మురళీ

జాతీయ ఫెస్ట్‌లో బహుమతులు

నరసరావుపేట రూరల్: జాతీయ స్థాయిలో గుంటూరు కళ్లం హరనాథరెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహించిన సంకల్ప్ టెక్ ఫెస్ట్‌లో నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పలు విభాగాల్లో బహుమతులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో నాల్గవ సంవత్సరం విద్యార్థులు రామారావు, రామంజనేయులు ప్రథమ బహుమతి, టెక్నికల్ క్విజ్‌లో వేణుగోపాల్, మోహన్‌లు ద్వితీయ బహుమతి సాధించినట్లు వివరించారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ బి.వెంకటశివ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు

ఊరెళితే సమాచారం అందించండి

- లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ సేవలు వినియోగించుకోండి
- తాళం వేసిన గృహాలపై సాంకేతిక నిఘా

నరసరావుపేటటౌన్: దసరా పండుగను పురస్కరించుకొని ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు సమాచారాన్ని తెలియజేస్తే వారి గృహాలపై లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా నిఘా ఉంచుతామని వన్‌టౌన్ సీఐ విజయ్ చరణ్ అన్నారు. శుక్రవారం మానిటరింగ్ సిస్టమ్‌పై పల్నాడు జిల్లా పోలీసులు రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. నరసరావుపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు దసరా పండుగ సందర్భంగా ఎవరైనా ఇంటిని వదిలి ఎక్కడికైనా ఇతర పట్టణాలకు వెళ్తుంటే అట్టి సమాచారాన్ని తెలియజేయాలన్నారు. ఏ రోజు నుంచి ఎన్ని రోజుల వరకు మీ ఇంటికి తాళం వేసి వెళుతున్నారో తెలియపరిస్తే వారి గృహాల వద్ద సాంకేతిక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. పోలీస్ శాఖ ప్రవేశ పెట్టిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ యాప్‌లోకి వెళ్లి మీ వివరాలు, చిరునామా, సెల్ నెంబర్ ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్న తర్వాత ఊరు వెళ్లి వచ్చేంతవరకు సీసీ కెమెరా పర్యవేక్షణలో మీ ఇంటి మీద నిఘ ఉంచబడుతుందన్నారు.. తాళం వేసి ఉన్న మీ ఇంటి భద్రత కోసం పోలీస్ శాఖ అందిస్తున్న ఉచిత సేవను ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ విజయ్ చరణ్, సిబ్బంది

మోతాదుకు మించి ఎరువులు వాడవద్దు

నరసరావుపేట రూరల్: మోతాకు మించి ఎరువులను వినియోగించడం వలన సూక్ష్మపోషకాల లోపాలు తలెత్తుతాయని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి తెలిపారు. మండలంలోని ఇక్కుర్రులో రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకంపై రైతులకు శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో డీడీఏ శివకుమారి, ఏడిఏ పి. మస్తానమ్మ,జిల్లా వనరుల కేంద్రం ఏవో పి.ప్రవీణ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీడీఏ శివకుమారి మాట్లాడుతూ పురుగుమందులు ఎక్కువుగా వాడటం వలన మిత్రపురుగులకు నష్టం ఎక్కువుగా జరుగుతుందని తెలిపారు. జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులను ఉపయోగించుకోవాలని సూచించారు. ఏడీఏ మస్తానమ్మ, ఏవో ప్రవీణ్ మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం వలన ఓజోన్ పొర దెబ్బతినడం వలన ఉష్ణోగ్రతల ఎక్కువగా ఉంటున్నాయని తెలిపారు.

శరణు దుర్గమ్మా...



నరసరావుపేటలో గాయత్రి అలంకరణలో పార్వతీ అమ్మవారు



నరసరావుపేటలో కౌమారి అలంకరణలో శ్రీచౌడేశ్వరీ అమ్మవారు



రొంపిచర్ల మండలం విప్పర్లలో గాయత్రీ దేవి అలంకరణలో అమ్మవారు



యడ్లపాడు పార్వతీదేవి అమ్మవారి ఆలయంలో దర్శనమిచ్చిన అమ్మవారు



నాదెండ్ల మండలం సాతులూరు శివాలయంలో..



నూజెండ్ల మండలం రవ్వవరంలో శ్రీలక్ష్మీదేవి అవతారంలో అమ్మవారు